క్లుప్తంగా

శాస్త్రోక్తంగా నవకలశ తిరుమంజనం



నవకలశాలతో అర్చకులు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలో నవ కలశ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. జేష్ఠ మాసం శుక్రవారం పురస్కరించుకుని ఎగువ అహోబిలంలో వెలసిన చెంచు లక్ష్మీ అమ్మవారు, దిగువ అహోబిలంలో వెలసిన అమృతవల్లీ అమ్మవార్ల మూలవిగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను కొలువుంచి వేదపండితుల వేదమంత్రోచ్చారణలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల మధ్య నవకలశాలతో అభిషేకించి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ దర్శన యాత్రకు స్పందన



వేలాంగిని క్షేత్రానికి బయల్దేరుతున్న యాత్రికులు

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దర్శన యాత్రకు విశేష స్పందన లభిస్తుందని డిపో మేనేజర్ గంగాధర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం తమిళనాడు వేలాంగిని మాత క్షేత్ర దర్శనం కోసం బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై మాసంలో గురు పౌర్ణమిని పురస్కరించుకొని అరుణా చలానికి వేలాంగిని మాత క్షేత్రానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. అదే విధంగా ఆగస్టు మాసంలో 16వ తేదీన మహాకాళేశ్వరం రానుపోను రూ.2,500, వేలాంగిని మాత క్షేత్ర దర్శనం ఆగస్టు 8న రానుపోను కలిపి రూ.2,800, గోవా యాత్రకు 22వ తేదీన రానుపోను చార్జీలు రూ.3,400 అవుతుందన్నారు. ఒక సమూహంగా వస్తే, ధార్మిక సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు బృందంగా వచ్చినా బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9505065651ను సంప్రదించాలన్నారు.

రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు



అనుమానితుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న దృశ్యం

నంద్యాల: గంజాయి అక్రమ రవాణ అడ్డుకట్ట వేసేందుకు శుక్రవారం రాత్రి అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న విజయవాడ–హుబ్లీ ప్యాసింజర్ రైల్‌తోపాటు వెయిటింగ్ హాల్, పార్సిల్ ఆఫీస్, క్యాంటీన్లలో క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానం ఉన్న పలు రైలు బోగీలలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రగ్స్, మాదకద్రవ్యాల గురించిన సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972, స్థానిక పోలీసులు, డయల్ 112కు తెలియజేయాలన్నారు. తనిఖీల్లో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సూర్యమౌళి, సీఐలు గంగయ్య యాదవ్, కుమారి, ఈగల్ టీం సిబ్బంది, స్పెషల్ టీం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐఓగా జి.లాలెప్ప



కర్నూలు సిటీ: ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారిగా జి.లాలెప్పను నియమిస్తూ శుక్రవారం ఇంటర్మీడియేట్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ప్రాంతీయ కార్యాలయ అధికారిగా సి.సురేష్ బాబు పని చేస్తున్నారు. ఈయనకు త్వరలోనే ఇంటర్మీడియేట్ బోర్డు ఆర్జేడీగా పదోన్నతి రానుండడంతో ఆయన స్థానంలో కెవిఆర్ బాలిక జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న జి.లాలెప్పకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన శుక్రవారం సాయంత్రం ఆర్‌ఐఓగా విధుల్లో చేరారు. లాలెప్ప 1998లో గణితం అధ్యాపకులుగా ఉద్యోగంలో చేరి గుంతకల్లు, ఓర్వకల్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేశారు. 2013లో అధ్యాపకుడి నుంచి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. కెవిఆర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పని చేస్తూ అనంతపురం కేఎస్‌ఆర్ జూనియర్ కాలేజీకి బదిలీ అయ్యారు. ఆ తరువాత కర్నూలు కెవిఆర్ బాలికల కాలేజీకి బదిలీపై వచ్చి ప్రస్తుతం అక్కడే పని చేస్తున్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అనంతరం శ్రీశైలంలోని అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మసీదు వద్ద ముస్తాక్ అహమ్మద్, కమిటీ సభ్యుల బృందాలు



వాగ్వాదం పడుతున్న ఇరువర్గాలు

టెన్షన్.. టెన్షన్

- వక్ఫ్ ల్యాండ్‌పై పట్టు కోసం వర్గపోరు
- లతీఫియా మసీదు వద్ద ఇరువర్గాల వాగ్వాదం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని లతీఫియా మసీదు వద్ద శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. వక్ఫ్ ల్యాండ్‌పై పట్టు కోసం వర్గపోరు రోజు రోజుకు ముదురుతోంది. మసీదు కమిటీ సభ్యులు శుక్రవారం మసీదులోకి చేరుకున్నారు. అప్పటికే వక్ఫ్ బోర్డు స్థలంలోని పాఠశాల వద్ద ఉన్న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్ ఎవరు మీరు అంటూ కమిటీ సభ్యులను ప్రశ్నించారు. వక్ఫ్‌బోర్డు అధికారులు తమను లతీఫియా మసీదు కమిటీ సభ్యులుగా నియమించారని, మసీదు అభివృద్ధికి కృషి చేసేందుకు ఇక్కడికి వచ్చామని చెప్పారు. ఈ విషయంపై కోపోద్రిక్తుడైన ముస్తాక్ అహమ్మద్ 'బిల్డింగ్ నాదే.. స్థలం నాదే, మసీదు నాదే.. ఇక్కడ ఎవరికి ఎలాంటి హక్కులు లేవంటూ' ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసుల రంగ ప్రవేశం ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించేశారు.

వక్ఫ్‌బోర్డు స్థలం సమస్య ఇది..

సర్వేనెం.2179లోని 1.74 ఎకరాల వక్ఫ్‌భూములపై పట్టు కోసం అధికార పార్టీలో ఆధిపత్య పోరు నెలకొంది. ఒక వర్గానికి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్ నాయకత్వం వహించగా, మరో వర్గానికి టీడీపీ స్థానిక మంత్రి ఫరూక్ అనుచరులు ఉన్నారు. మూడు మాసాల క్రితం లతీఫియా మసీదుకు వక్ఫ్‌బోర్డు అధికారులు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మసీదు వద్ద ఉన్న వక్ఫ్‌బోర్డు స్థలానికి లీజు డబ్బులు చెల్లించలేదని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు స్థలంలో ఉన్న ఇఖ్రా స్కూల్‌ను మూయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మౌలానా ముస్తాక్ అహమ్మద్‌కు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చింది. నాటి నుంచి ఇఖ్రా స్కూల్, లతీఫియా మసీదు తన సొంత మంటూ ముస్తాక్ అహమ్మద్ బాహటంగా చెబుతున్నారు. ఈ విషయాన్ని వక్ఫ్‌బోర్డు అధికారులు తిరస్కరిస్తూనే ఇటీవల మసీదు కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా మాజీ కో ఆప్షన్ మెంబర్ ఖలీల్ మాట్లాడుతూ స్టేట్ వక్ఫ్‌బోర్డు అధికారులు మసీదుల అభివృద్ధి కోసం పట్టణంలోని రెండు మసీదులకు కమిటీలను ఏర్పాటు చేశారన్నారు. వక్ఫ్‌బోర్డు స్థలంలో సొంత భవనాలు ఏర్పాటును ఒప్పుకోమని, దౌర్జన్యాలకు దిగడం మంచిది కాదన్నారు.

ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి

వివాదాస్పదమైన వక్ఫ్‌బోర్డ్ స్థలంలో ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ కోరారు. నంద్యాల చుట్టుపక్కల ప్రాంతాల్లో మైనార్టీ విద్యార్థులు అధికంగా ఉందని, వారి సౌకర్యార్థం ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

నంద్యాల(అర్బన్): నంద్యాల పట్టణంలోని పలు ఎరువుల గోడౌన్లు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో శుక్రవారం వ్యవసాయాధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నంద్యాల ఏడీఏ ఆంజనేయ, ఏఓ ప్రసాదరావు, సాంకేతిక వ్యవసాయధికారి కిశోర్‌లు, నందికొట్కూరు ఏడీఏ గిరీష్, వ్యవసాయాధికారులు షేక్షావలి, పవన్‌కుమార్‌లు రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టార్లు, అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో భాగంగా సుదర్శన్ ట్రేడర్స్‌లో రూ.2.5 లక్షల విలువైన 18.45 మెట్రిక్ టన్నుల ఎరువుల తాత్కాలిక అమ్మకాలను నిలిపి వేశారు. ఈ సందర్భంగా డీఏఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నంద్యాలలోని గోడౌన్, ఎరువుల దుకాణాల యజమానుల యాక్టు చట్టం ప్రకారం ఎరువుల వ్యాపారాలు జరగాలన్నారు. గోడౌన్లు, దుకాణాల్లో ఎరువుల నిల్వల వివరాలను ప్రతి రోజు మండల వ్యవసాయాధికారులకు తెలపాలన్నారు.



ఎరువుల రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

బేస్ బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి సీనియర్ బేస్ బాల్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు సత్యసాయి జిల్లా కదిరిలో జరిగే 7వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారుల విజయ సాధన కోసం కృషి చేస్తూ బేస్‌బాల్ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్న పీఈటీ పుల్లయ్యను డైరెక్టర్ షేక్షావలి రెడ్డి అభినందించారు.


అప్పల భారంతో ఆత్మహత్య



భాస్కర్‌రెడ్డి (ఫైల్)

రుద్రవరం: ముత్తలూరుకు చెందిన నంద్యాల భాస్కర్ రెడ్డి (48) అప్పులభారంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ మహమ్మద్ రఫి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఆలమూరు గ్రామ సమీపంలోని దొన్లవాగు వద్ద ఈ నెల 10వ తేదీన భాస్కర్‌రెడ్డి పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబీకులు కర్నూలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. తన భర్త పొలం కౌలుకు తీసుకోని వ్యవసాయం చేశాడని పంటలు పండక అప్పులు కావడంతో తీర్చలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య సుభద్రమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రజలు కుటుంబ నియంత్రణ పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళిక బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణ మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం పాటించాలన్నారు. తల్లి కావడానికి సరైన వయస్సు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు వివాహ వయస్సును ఆడవారికి 21 ఏళ్లు, మగవారికి 25 ఏళ్లు ఉండేలా చూడాలన్నారు. బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం కోసం మహిళలు లూపు, (పీపీఐయూడీసీడీ) అంతరా, అదే విధంగా మగవారు నిరోధ్ మొదలైన తాత్కాలిక పద్ధతులను అవలంబించాలన్నారు. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశం సౌభాగ్యంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమములో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సుదర్శన్ బాబు, డీపీఎంఓ డాక్టర్ అంకిరెడ్డి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్లు ప్రసన్నలక్ష్మీ, కాంతారావు నాయక్, భారత్ కుమార్ ఇన్‌చార్జి డెమో రవీంద్ర నాయక్, ఎంపీఈవోలు జగదీశ్వరప్ప, శివరామయ్య, సచివాలయ ఆరోగ్యకార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోడ కూలి బాలుడి మృతి

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో పాతగోడ కూలి ఐదేళ్ల బాలుడు మరణించాడు. ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన కరిముల్లాకు ఇద్దరు కుమార్తెలు సంతానం. మొదటి కుమార్తె షాహిన్‌కు పెద్దకొప్పెర్లకు చెందిన మాబాషాతో వివాహమైంది. వీరికి మహ్మద్ హారిఫ్(5)తో పాటు తమ్ములు, చెల్లెలు సంతానం. శుక్రవారం కరిముల్లా కూలీ పనులకు వెళ్తుండగా ఆయనతో పాటు హారిఫ్ కూడా వెంట వెళ్లాడు. ఇదే గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డికి సంబంధించి పాతమిద్దెను తొలగిస్తున్నారు. పై నుంచి తొలగించేందుకు కట్టెలతో సార్వ వేసుకున్నారు. గోడలు పాతబడడంతో సార్వ, గోడ కూలిపోయింది. అప్పటికే తాత వెంట వచ్చిన మహ్మద్ హారిఫ్ గోడ వద్దనే ఉన్న విషయాన్ని గమనించలేదు. సార్వపై ఉన్న కరిముల్లా, శేషిరెడ్డితో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు బాలుడి కోసం వెతుకుతూ రాళ్లను తొలగిస్తుండగా వాటి మధ్య రక్తపు మడుగులో కనిపించాడు. వెంటనే నంద్యాల జీజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.


నేషనల్ హైవేస్ ఈఈగా విజయభాస్కర్‌రెడ్డి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లా నేషనల్ హైవేస్ ఈఈగా సి.విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఈఈగా విధులు నిర్వహించిన శంకర్‌రెడ్డి ఎస్ఈగా పదోన్నతిపై విజయవాడ నేషనల్ హైవేస్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ కడప ఎన్‌హెచ్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న విజయభాస్కర్‌రెడ్డిని ప్రభుత్వం ఇక్కడకు బదిలీ చేసింది. నూతన ఈఈగా బాధ్యతలు చేపట్టిన ఈఈని ఎన్‌హెచ్ డీఈఈలు జగదీష్ గుప్త, రవిచంద్ర, ఏఈఈలు మునిస్వామి, భార్గవ్, శేఖర్, రవికాంత్, అసోసియేషన్ నాయకులు రమణ, కార్యాలయ సిబ్బంది పూలబొకేలు అందించి అభినందనలు తెలిపారు.

డీఈఈగా రవిచంద్ర బాధ్యతల స్వీకరణ

నేషనల్ హైవేస్ డీఈఈగా రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌అండ్‌బీలో కోడుమూరు సబ్ డివిజన్ డీఈఈగా విధులు నిర్వహిస్తున్న రవిచంద్రను ఎన్‌హెచ్‌కు బదిలీ చేస్తూ ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీరు నయాముల్లా ఉత్తర్వులు జారీ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



డీఆర్‌ఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బకాయిలు చెల్లిస్తామని చెప్పి ఇంత వరకు జమ చేయలేదన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కోర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులు వారికి ఉద్యోగాలు వచ్చినా, పై చదువులకు వెళ్లాలన్నా కళాశాల యజమానులు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉద్యోగాలకు వెళ్లలేకపోతున్నారన్నారు. డిగ్రీ విద్యార్థులకు సింగిల్ మేజర్ సబ్జెక్టు కాకుండా ట్రిబుల్ మేజర్ సబ్జెక్టు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శశిధర్‌రెడ్డి, ప్రవీణ్, మహేష్, అక్రాం, చంద్రశేఖర్ నాయక్, ధనుస్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల దేవస్థానానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఆర్.రవికుమార్ రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు కె.అయ్యన్నకు అందజేశారు. దాతకు రశీదు, లడ్డూ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.



వెలగలపల్లె పొలిమేరలో వరి నాట్లు వేస్తున్న కూలీలు



అప్పనపల్లె సమీపంలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న దృశ్యం

ఆశల సాగు షురూ

రుద్రవరం: బోరు బావుల కింద రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మాగాణులను సేద్యం చేసి వరి నాట్లు వేస్తున్నారు. మండల పరిధిలోని కొండమాయపల్లె, వెలగలపల్లె, అప్పనపల్లె, చిత్రేనిపల్లె, ముకుందాపురం, డీ.కొట్టాల తదితర గ్రామాల పరిధిలో వరి సాగుకు సమాయత్తవుతున్నారు. నాట్లు వేసేందుకు కూలీలు ఎకరానికి దాదాపు రూ.4 వేల ప్రకారం ఒప్పందం చేసుకుని పనికి వెళ్తున్నారు. వర్షాలు కురిసి ఆయకట్టుకు నీరందితే మండలంలో పొలం పనులు మరింత ఊపందుకునే అవకాశం ఉంది.

జీతాలు తీసుకోవడం కాదు.. పని చేయండి

- గోస్పాడు అధికారులపై మంత్రి, కలెక్టర్ ఆగ్రహం



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): 'అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రజలు అభివృద్ధి సాధించలేకపోతున్నారు. నెల వచ్చే సరికి జీతాలు తీసుకోవడం కాదు. మండలం అభివృద్ధి, ఆదాయ వనరులు పెరిగేలా చర్యలు తీసుకోవాలి' అని గోస్పాడు మండల అధికారులపై మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో పీ–4 సమావేశాన్ని నిర్వహించారు. నంద్యాల, గోస్పాడు, మహానంది, మండలాలకు చెందిన అధికారులతో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గోస్పాడు మండలం ఎందుకు అభివృద్ధి చెందడం లేదని అధికారులపై కలెక్టర్, మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహానంది మండలంలో రైతులు తక్కువగా ఉన్నా అరటి తోటల పెంపకం వల్ల అభివృద్ధి చెందుతున్నారన్నారు. గోస్పాడు మండలంలో రైతులు ఎక్కువగా ఉన్నా మండలం ఎందుకు అభివృద్ధి చెందడం లేదని అధికారులను ప్రశ్నించారు. కారణాలు చెప్పాలని మంత్రి అడిగినా.. ఎవరూ సమాధానం చెప్పలేదు. దీంతో అధికారులపై మంత్రి, కలెక్టర్ మండిపడ్డారు. 'మీ నిర్లక్ష్యం వల్ల ప్రజలు, రైతులు నష్టపోతున్నారు. మండలం అభివృద్ధిలో వెనకబడుతుంది. మళ్లీ నిర్వహించే సమావేశానికి పూర్తి స్థాయిలో వివరాలతో హాజరు కావాలి' అని ఆదేశించారు. ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను, లక్ష మంది మార్గదర్శులను గుర్తించేలా లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళుతున్నామని ఈ లక్ష సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో చైర్‌పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, నంద్యాల ఎంపీపీ ప్రభాకర్ అధికారులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సమితి నాయకులు

నంద్యాల(అర్బన్): కేసీ కెనాల్ కింద సాగు చేసిన లక్ష ఎకరాల పంటలకు తక్షణమే నీటి విడుదల ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వైఎన్‌రెడ్డి కోరారు. ఎండుతున్న మినుము, సోయాబిన్ మొక్కజొన్న, తదితర ఆరుతడి పంటలను రక్షించేందుకు నీటిని విడుదల చేయాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి సమితి నాయకులతో కలిసి ఆయన వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలను కాపాడుకునేందుకు కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని జలవనరుల శాఖకు 15 రోజుల క్రితమే విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్ దృష్టికి తీసుకెళ్లితే నిర్లక్ష్యపు సమాధానాలతో రైతులను అవమానకరంగా మాట్లాడుతున్నారన్నారు. కాల్వల మరమ్మతులని, నీరు ఇప్పుడే వదిలేది లేదంటూ చెబుతుండటంతో పిందె, పూత దశలో ఉన్న పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బెక్కం రామసుబ్బారెడ్డి, చిన్న రామకృష్ణారెడ్డి, పట్నం రాముడు, మహేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సారె సమర్పణ





జగజ్జననీ అమ్మవారికి సారె, బోనాలను ఊరేగింపుగా తీసుకొని వస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): ఆషాఢ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకొని పట్టణంలో వెలసిన శ్రీజగజ్జననీ అమ్మవారికి, శ్రీకాళికాంబదేవికి, అమ్మవార్లకు భక్తులు పెద్ద ఎత్తున సారె సమర్పించారు. ఈ సందర్భంగా జగజ్జననీ ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలచే అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని పట్టువస్త్రాలచే అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ జిల్లాలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి మహిళలు అమ్మవారి ప్రతిమను అలంకరించి పుట్టింటి పట్టుచీర, సారెను మేళతాళాలతో తీసుకొని వచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం దుర్గా ఫ్రెండ్స్ యూనిట్‌సభ్యులు భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కాళికాంబ దేవస్థానంలో అమ్మవారికి పెద్ద ఎత్తున చీర, సారెను సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మినారాయణ, ఆలయ చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిగా వాసవీ మాత



మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారి శాలలో శుక్రవారం వాసవీ మాతకు శాకాంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే అమ్మవారికి అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారికి కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు భవనాశి వాసు, మహేష్, రామశేషు, ఇందుమతి, శోభారాణిలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఓ రామునాయక్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మీ ఓబులేసు, అధ్యక్షులు రంజిత్, కార్యదర్శి ప్రతాప్‌లు మాట్లాడుతూ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు పదవీ విరమణ పొందినా.. మరణించినా.. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు భూమిని శ్రీనివాసులు, శివరాం, మస్తాన్, డోన్ చంద్రశేఖర్, జిలానీ బాషా, స్వామిరెడ్డి, గౌస్, అజయ్, రవి, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

పంటను దెబ్బ తీస్తున్నాయని...

- విష గుళికలు కలిపి 16 కోళ్లను చంపేసిన వైనం



మృతి చెందిన కోళ్లు

రుద్రవరం: శ్రీరంగాపురం గ్రామానికి చెందిన ఓ రైతు కక్షకు 16 కోళ్లు మృత్యువాత పడ్డాయి. బాధితులు శ్రీనివాసులు, కొండయ్య, నాగేంద్రమ్మ శుక్రవారం తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని కొత్త కాలనీలో నివాసముంటున్న వారు ఇళ్ల వద్ద నాటు కోళ్లను పెంచుకుంటున్నారు. అయితే రోడ్డుకు అవతలివైపున ఓ రైతు తన పొలంలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పంట సంరక్షణకు చుట్టూ కంచె వేశాడు. అయితే కాలనీ వాసులు పెంచుకునే కోళ్లు పొలంలోకి వెళ్లి పంటను దెబ్బతీస్తాయని వాటికి బియ్యం, నూకలు వంటి వాటిలో విష గుళికలు కలిపి చల్లాడు. అవి తినగానే 16 కోళ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. మరి కొన్ని కొన ఊపిరితో కొట్టుకుంటున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మహమ్మద్ రఫి తెలిపారు.

భారీగా కొట్టుకొస్తున్న గుర్రపుడెక్క

దొర్నిపాడు: కూందునదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎగువ ప్రాంతం నుంచి గుర్రపు డెక్క భారీగా కొట్టుక రావడంతో క్రిష్టిపాడులోని వంతెనకు అడ్డుపడింది. దీంతో వంతెనకు డెక్క ప్రమాదకరంగా మారింది. దిగువ ప్రాంతానికి నీరు వెళ్లేందేకు వీలులేకండా పోతుంది. గుట్టగుట్టలుగా కొట్టుక వస్తుండతంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. బ్రిడ్జికి ఒత్తిడి పెరుగుతుందని అధికారులు స్పందించి తొలగించాలని కోరుతున్నారు.

వంతెనకు భారీగా అడ్డుపడ్డ గుర్రపు డెక్క

